క్లుప్తంగా

కూలీల సంఖ్య పెంచండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్

అమరాపురం: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేయడానికి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఏ గ్రామాల్లో ఏఏ పనులు చేస్తున్నారు, ఎంతమంది కూలీలు పనికి హాజరవుతున్నారు తదితర విషయాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రతి అధికారి గ్రామంలో పనులు చేయడానికి వచ్చేలా కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే చేసిన పనులకు బిల్లులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

4న మండల సర్వసభ్య సమావేశం

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 4వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కేశవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల ఎంపీపీ అధ్యక్షతన సమావేశం ప్రారంభిస్తామన్నారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తప్పక సమావేశానికి హాజరు కావాలని కోరారు. మండల సమస్యలపై సభలో చర్చించడం జరుగుతుందన్నారు.

కన్నవారి కలలు నెరవేర్చండి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: విద్యార్థులు కన్న తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంత్రి సవిత విద్యార్థులకు నోటు పుస్తకాలను, బ్యాగులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో, భవిష్యత్ ప్రణాళికతో చదివితేనే కన్న వారి కలలు నెరవేరతాయని సూచించారు. కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులు చదవాలన్నారు. ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు మూర్తి, హఫీజ్, శివణ్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ బ్రాంచ్ ప్రారంభం



నానెప్పనగర్ బ్రాంచ్ ప్రారంభిస్తున్న రీజినల్ మేనేజర్ రమేష్

హిందూపురం: పట్టణంలోని నానెప్పనగర్‌లో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్‌ను బుధవారం ఆ బ్యాంకు రీజినల్ మేనేజర్ రమేష్ ప్రారంభించారు. ఈ బ్రాంచ్ ద్వారా సత్వరం రిటైల్, ఎంఎస్ఎంఈ రుణాలు మంజూరు చేస్తామని రమేష్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్లు వెంకటరమణయ్య, ప్రవీణ్ కుమార్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

క్రిష్టప్ప సేవలు మరువలేము



వీఆర్ఓ క్రిష్టప్పతో సహచర సిబ్బంది

అమరాపురం: మండలంలోని మద్దనకుంట, అమరాపురం, కె.శివరం గ్రామంలో వీఆర్వోగా విధులు నిర్వర్తిస్తూ క్రిష్టప్ప చేసిన సేవలు మరువలేనివని ఎంపీడీఓ భాస్కర్, ఆర్ఐ గిరియప్ప, గ్రామ పెద్దలు గణేష్, మంజునాథ, వెంకటరమణప్ప కొనియాడారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ క్రిష్టప్ప పదవీ విరమణ పొందగా, వీడ్కోల సమావేశాన్ని తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్రిష్టప్పను ఘనంగా సత్కరించారు.



అలూడి గ్రామం వద్ద సాగు చేసిన కీర దోస

లాభసాటిగా కీర సాగు

- 30 రోజుల నుంచే పంట చేతికి ..
- ఎకరాకు రూ 1.30 లక్షల నుంచి రూ.2 లక్షల వరకూ లాభం
- మడకశిర నియోజకవర్గంలో 450 హెక్టార్లలో సాగు

అగళి: నియోజకవర్గంలోని రైతులు వాణిజ్య పంటల సాగుకు అసక్తి చూపుతున్నారు. వేరుశనగతో పాటు ఇతర సంప్రదాయ పంటలు సాగు చేసి వరుసగా నష్టపోవడంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగానే నియోజకవర్గంలోని అగళి, గుడిబండ, అమరాపురం, రొళ్ల, మడకశిర మండలాల్లో బోరు బావుల కింద రైతులు కీర (దోసకాయలు) పంట సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

తక్కువ వ్యవధిలోనే పంట చేతికి...

ఎకరాలో దోసకాయలు పెడితే రూ.30 వేల నుంచి దాదాపు రూ.40 వేల వరకూ ఖర్చు వేస్తుంది. పంట వేసిన 30 రోజుల్లో పంట కోసుకోవచ్చు. ఇలా దాదాపు 50 రోజుల పాటు పంట దిగుబడి వస్తూనే ఉంటుంది. ఖర్చులు పోను రూ. 1.30 లక్షల నుంచి రెండు లక్షల లాభం వస్తోందని రైతులు చెబుతున్నారు. మడకశిర నియోజకవర్గంలో వాతావరణం సమతూల్యంగా అనుకూలంగా ఉండటంతో ఎక్కువ మంది దోసకాయలను పండించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అగళి మండలంలో ప్రసార, జీజీసీఎల్ తదితర కంపెనీలు, రొళ్ల మండలంలో ఆగ్రోటెక్, ఇండో స్పానిస్ మూరారి, గుడ్‌గ్రీన్స్ వంటి వివిధ కంపెనీలకు చెందిన కీర విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

గ్రేడ్ బట్టి రేటు..

రోజూ ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల వరకూ కాయలు కోతకు వస్తాయి. దోస కాయల గ్రేడ్ బట్టి ధరలు ఉంటాయి. ఒకటి నుంచి ఐదు గ్రేడ్ వరకూ రకాలు ఉంటాయి. ఆయా రకాల చొప్పున కేజీ కీర కాయలకు కంపెనీ వారు బిల్లు చెల్లిస్తారు. ఆఖరి బిల్లులో ఇచ్చిన ఎరువులు, విత్తనాలు మందులు తదితర వాటికి సంబంధించి బిల్లును జమ చేసుకుని మిగిలిన మొత్తాన్ని రైతు ఖర్చులు పోను ఎకరాకు రూ.1.30 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు ఆదాయం పొందుతున్నామని రైతులు సంతోషంగా చెబుతున్నారు.

విదేశాలకు ఎగుమతి

అగళి మండల పరిధిలో సాగు చేసిన దోసకాయలను రైతుల ఎదురుగానే తూకం వేసి కర్ణాటక రాష్ట్రం శిర, అగళి మండల దొక్కలపల్లి, రొళ్లలో ఉన్న ఆయా కంపెనీల బ్రాంచ్‌లకు తరలిస్తారు. అక్కడి నుంచి తమిళనాడు, రాణిబెన్నూర్, తుమకుర్, కుణిగల్ వంటి పట్టణాల్లో ఉన్న ఫ్యాక్టరీలకు తరలిస్తుంటారు. ఫ్యాక్టరీలో పౌష్టికాహారం, ఊరగాయలు తయారు చేసి బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తారు. ఏడాదిలో జూన్, నవంబర్‌లో మాత్రమే రెండుసార్లు కీర పంటను సాగు చేసుకోవచ్చని రైతులు చెబుతున్నారు.

ఉన్న ఊళ్లోనే ఉపాధి



మండలంలో ఎక్కువ శాతం మంది రైతులు బోరుబావుల కింద కీర పంటను సాగు చేస్తున్నారు. దీంతో స్థానికంగా కూలీలకు ఉపాధి లభిస్తోంది. ఉన్న గ్రామంలోనే రోజూ రూ.300 కూలి ఇస్తున్నారు. వలస వెళ్లకుండా ఉన్నచోటే ఉపాధి దొరుకుతుండటంతో ఆనందంగా ఉంది. కుటుంబ పోషణ కూడా భారంగా అనిపించడం లేదు.

– సుజాతమ్మ, కదిరేపల్లి, అగళి మండలం

ఆదాయం బాగుంది



గతంలో వేరుశనగ పంట వేసి నష్టపోయే వాళ్లం. అయితే గత నాలుగేళ్లుగా కీర పంట సాగు చేస్తున్నా. ఈ ఏడాది 0.75 సెంట్ల విస్తీర్ణంలో కీర సాగు చేశాను. ఖర్చులన్నీ పోనూ రూ.60 వేలకు పైగా ఆదాయం వచ్చింది.

– మంజునాథ్, అలూడి, అగళి మండలం



సాగు విధానం ఇలా...

ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా 450 హెక్టార్లలో రైతులు కీర సాగు చేశారు. ఎకరాకు 10 వేల విత్తనాలు ముందుగా డ్రిప్ చేసుకోని మూడు, నాలుగు అడుగుల వెడల్పు, ఎనిమిది ఇంచుల పొడవు ప్రకారం విత్తనాలు పొలంలో నాటుకోవాలి. విత్తనాలు నాటిన 15 రోజులకు పంట మధ్యలో 10 అడుగుల దూరంలో కట్టిలను ఏర్పాటు చేసుకోవాలి. ఆ కట్టెపై భాగాన తీగకు కింది నుంచి కీరకాయ చెట్టుకు దారం కట్టాల్సి ఉంటుంది. విత్తనాలు, ఎరువులు, మందులు తదితర వాటిని ఆయా కంపెనీల ప్రతినిధుల వారు ముందుగానే రైతులకు అందిస్తారు. విత్తనాలు నాటిన 30 రోజులకు కోతలు మొదలవుతాయి. దాదాపు 50 రోజుల పాటు కీరకాయలు నిరంతరంగా వస్తుంటాయి.

ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులు

- జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి

లేపాక్షి: సమాజంలో ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి అన్నారు. మండలంలోని గొరిగానపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఆదినారాయణ పదవీ విరమణ చేశారు. ఇందులో భాగంగానే బుధవారం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ విద్యార్థులకు బోధన చేసే ముందు ఉపాధ్యాయులు కూడా సన్నద్ధం కావాల్సి ఉంటుందన్నారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు ఆదినారాయణ తన విధులను సక్రమంగా నిర్వర్తిస్తు మంచి పేరు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. విద్యాభివృద్ధికి , పిల్లల్లో మంచి క్రమశిక్షణ, విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు. అనంతరం



ఆదినారాయణ దంపతులను సన్మానిస్తున్న డీఈఓ, ఉపాధ్యాయులు

పదవీ విరమణ పొందిన ఆదినారాయణ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవగుప్తా, ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప, సల్మాన్‌రాజ్, విశ్రాంత ఎంఈఓ శ్రీరాములు, ఉపాధ్యాయ సంఘం నాయకులు విజయశేఖర్, రామదాసునాయక్, కొండారెడ్డి, హిదాయతుల్లా, రమణకుమార్, సాయినాథ్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

రొద్దం: ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సమష్టి కృషితోనే బాల్యవివాహాల వ్యవస్థలను రూపుమాపవచ్చు అని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి అన్నారు. బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. బుధవారం మండల పరిధిలోని తురకలాపట్నం జిల్లా ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బాల్య వివాహాలు అరికడదాం ఆడబిడ్డలను కాపాడుదాం' అన్న కార్యక్రమాన్ని ఆర్డీటీ మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శివరామ్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శివయ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుజాత, ఆరోగ్య శాఖ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించండి

రొళ్ల: మెట్ట ప్రాంతాల్లో ఐదెకరాల్లోపు భూములు ఉండి ఆసక్తి ఉన్న సన్న, చిన్న కారు రైతులు పండ్ల తోటలు పెట్టుకునేలా ప్రోత్సహించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్, ఏపీఓ ఓబుళప్ప పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాది సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాది పథకం కింద సన్నచిన్న కారు రైతుల 315 ఎకరాల భూముల్లో పండ్ల తోటల పెంపకానికి అనుమతి వచ్చిందని తెలిపారు. ఇప్పటికే 75 మంది రైతులు దరఖాస్తు చేశారన్నారు. ఈ నెల 10వ తేదీలోపు రైతులచే దరఖాస్తులు స్వీకరించాలన్నారు. జేఈ మారేగౌడు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

5న సర్వసభ్య సమావేశం

అగళి: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని ఈనెల 5న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎం

సంక్షిప్త సమాచారం

పీపీ రేణుక అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలాధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

భూతప్పస్వామికి పూజలు



తమ్మడేపల్లి భూతప్పకు పూజలు చేస్తున్న భక్తులు

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి పొలిమేరలో వెలసిన భూతప్పస్వామికి భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం చివరి బుధవారం సందర్భంగా గ్రామస్తులు ఆలయం వద్దకు వెళ్లి ఉపవాసంతో ప్రత్యేక పూజలు చేశారు.

డ్రైవర్‌కు సన్మానం

మడకశిర: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ డి.ఈశ్వరప్ప బుధవారం పదవీ విరమణ పొందారు. ఈనేపథ్యంలో సిబ్బంది ఆయన్ను ఘనంగా సత్కరించారు. రీజినల్ లీడర్ హెచ్.సుబ్బరాయుడు , బ్రహ్మానందరెడ్డి, ఏడీసీ శివారెడ్డి, జమేదార్ మోహన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి నోటీసు

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం మడకశిర నియోజకవర్గంలోని గుండుమలకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా ఏడీసీసీ బ్యాంక్ మాజీ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆనందరంగారెడ్డికి బుధవారం రాత్రి పోలీసులు ఆయన ఇంటికి వెళ్లి నోటీసు అందజేశారు. సీఎం పర్యాటన ముగిసే వరకూ ఇంటిలోనే ఉండాలని సూచించారు.

నిధుల కేటాయింపుపై విచారణ చేయాలి

- కౌన్సిల్ సమావేశాన్ని వాకౌట్ చేసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

హిందూపురం: గొల్లపల్లి రిజర్వాయర్ పంపింగ్ కేంద్రం వద్ద మోటర్లు, పైప్‌లైన్లు మరమ్మతుల పేరుతో ప్రతి కౌన్సిల్ మీట్‌లో రూ.కోట్లు బిల్లులు రాస్తున్నారు. వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నెలలుగా విన్నవిస్తున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు. కనీస చర్యలు తీసుకోవడం లేదు. ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారులు ఇక్కడ ఎందుకు? వెళ్లిపోండి వచ్చే అధికారులతో పనులు చేయించుకుంటాం' అని మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా ధ్వజమెత్తారు. బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 36 అంశాలతో పాటు మూడు అంశాల టేబుల్ అజెండాను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. అభివృద్ధి పనులు, ఇతర పనులకు సంబంధించి నిధుల చెల్లింపులు, సీఎఫ్ఎంఎస్ చెక్కులపై సమగ్ర విచారణ చేపట్టాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గిరీష్, నాగేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ ఇప్పటికే విచారణ చేయాలని అధికారులకు కోరడం జరిగిందని, దీనిపై మరోసారి ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి సమగ్ర విచారణ చేపట్టే విధంగా చూస్తామన్నారు.

మోటార్లు, పైప్‌లైన్లకు రూ.కోట్ల చెల్లింపులా?

గొల్లపల్లి రిజర్వాయర్ నీటి సరఫరాకు సంబంధించి కరువు నిధులు రూ.1.50 కోట్లు నిధులు మోటర్లు, మరమ్మతుకు కేటాయించడం పట్ల వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం తెలిపారు. పంప్‌సెట్ల మరమ్మతులు, ప్యానల్ బోర్డు, ట్రాన్స్‌ఫారాల మరమ్మతు పేరుతో అధిక నిధులు ఖర్చు చేస్తున్నారన్నారు. వేసవిలో నీటి ఇబ్బంది ఉన్నప్పుడు చేయలేదని, ఇప్పుడు కలెక్టర్ ద్వారా కరువు



టీడీపీ కౌన్సిలర్‌తో వాగ్వాదానికి దిగిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

నిధులు వస్తేనే రిపేర్లు తదితరాల పేరుతో ఖర్చు చేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లు గతంలో టెండర్లు వేసిన పనులనే ఇప్పటికీ మొదలు పెట్టలేదన్నారు. కరువు నిధులతో అత్యవసరం లేకపోయినా ఎలా కేటాయిస్తారని ధ్వజమెత్తారు. ఈ పనుల ప్రతిపాదనలు ఆమోదించలేమని తేల్చిచెప్పారు. గత నెలలో రూ.2 కోట్లు కేటాయించారని, ఇప్పుడు మళ్లీ రూ.1.50 కోట్లు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. కొత్త మోటర్లు, ప్యానెల్ బోర్డు, ట్రాన్స్‌ఫార్మర్లు కొనుగోలు చేసినప్పటికీ ఇంత ఖర్చు రాదని, ప్రతినెల మీటింగ్‌లో మరమ్మతులకే రూ.కోట్లు ఖర్చు పెట్టడం చూస్తుంటే ఇది పెద్ద అవినీతి దందాగా అనుమానం వస్తోందన్నారు. దీనిపై అధికారులు, పాలకపక్షం క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. మరమ్మతులకు సంబంధించి 11 అంశాలను వాయిదా వేయాలన్నారు. దీనికి టీడీపీ కౌన్సిలర్లు అడ్డుచెబుతూ ఆ అంశాలు అమోదించాలని చెప్పడంతో అభివృద్ధికి తాము అడ్డుకాదని, అవినీతిని కట్టడి చేయాలనే వాటికి ఆమోదం చెప్పకుండా విచారణ జరిపించాలని కోరుతున్నామన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. కరువు నిధులకు సంబంధించిన 11 అంశాలను మినహాయించి మిగిలిన అంశాలను ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ఇంద్రజ స్పష్టం చేసి సమావేశాన్ని ముగించారు.

ఉచిత వైద్య శిబిరం

హిందూపురం అర్బన్: ఆరోగ్యమే మహాభాగ్యమని వైద్యులు రామ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సంతేబిదనూరులో వాసవ్య మహిళా మండలి విప్రో కేర్స్, కుశాల్ హెల్త్ కేర్ క్లినిక్, కిమ్స్ సవీరా ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 130 మందిని పరీక్షించి తగిన మందులు అందజేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

హిందూపురం టౌన్: పట్టణంలోని మేళాపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నాగరాజు పదవీ విరమణ చేయడంతో బుధవారం ఆయన్ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎంఈఓ మాట్లాడుతూ నాగరాజు దాదాపు 30 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేశారని, ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు.



ఉపాధ్యాయుడు నాగరాజును సన్మానిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిలమత్తూరు: మండలంలోని 544ఈ జాతీయ రహదారి చిలమత్తూరు క్రాస్ వద్ద బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రం గూళూరుకు చెందిన శంకర్‌కు తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా హుటాహుటిన బాగేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో బైక్ అదుపు తప్పినట్లు తెలిసింది.

మద్యం కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

పెనుకొండ రూరల్: కర్ణాటక మద్యం విక్రయం కేసులో న్యాయమూర్తి బొజ్జప్ప ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలమేరకు... పెనుకొండ మండలంలోని శెట్టిపల్లికి చెందిన హనుమంతు, రవినాయక్ కర్ణాటక మద్యం విక్రయిస్తూ 2020వ సంవత్సరంలో పోలీసులకు పట్టుబడటంతో కేసు నమోదు చేశామన్నారు. ఈ నేపథ్యంలో కేసు విచారణ పూర్తికాగా న్యాయమూర్తి వారికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల జరిమానా, మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వారిని పోలీసులు సబ్‌జైల్‌కు తరలించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

పావగడ: పర్యావరణాన్ని పరిరక్షించడానికి విద్యార్థి దశ నుంచే ముందుకు రావాలని సురపనేని ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకుడు విద్యాసాగర్ విద్యార్థులకు సూచించారు. నాగలమడకలో చోళుల కాలంలో నిర్మించిన పురాతన దొడ్డకెరె (పెద్ద చెరువు) ఆవరణలో గ్రామ పంచాయతీ, అటవీశాఖ, గురుకుల విద్యాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి శివప్ప, రోటరీ అధ్యక్షుడు సత్యలోకేశ్, గరుకుల విద్యాసంస్థ కార్యదర్శి ఎన్‌సీ నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

'పురం'పాత్రికేయులకు ఇన్సూరెన్స్



పోస్టల్ ఇన్సూరెన్స్ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న పాత్రికేయులు

హిందూపురం: హిందూపురం ప్రెస్‌క్లబ్‌లో నూతన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జర్నలిస్టులకు పోస్టల్ ఇన్సూరెన్స్ నమోదు కార్యక్రమాన్ని రెడ్డి జేఏసీ అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి సహకారంతో చేపట్టారు. నిత్యం వార్తల సేకరణలో బిజీగా ఉండే జర్నలిస్టులకు దురదృష్టవశాత్తూ ప్రమాదానికి గురైతే వారి కుటుంబాలు ఇబ్బంది పడకూడదనే పోస్టల్ బీమా సదుపాయం కల్పించడం జరిగిందని వెంకటేష్‌రెడ్డి తెలిపారు. దాదాపు 42 మందికి బీమా చేయించామని, ప్రమాదవశాత్తూ ఎవరైనా మృతి చెందితే రూ.10 లక్షలు బాధిత కుటుంబానికి అందిస్తారన్నారు. వచ్చే ఐదేళ్లూ తానే రెన్యూవల్ డబ్బును కూడా చెల్లిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి ప్రశాంత్, సహాయ కార్యదర్శులు రాజేష్, చరణ్, గౌరవ అధ్యక్షుడు ప్రకాష్, ఉపాధ్యక్షులు రమేష్, అల్లిపిరా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ స్క్రీన్‌ల ఏర్పాటు

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం గుండుమల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమానికి హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 1 గంట నుంచి 5 గంటల వరకూ మండల కేంద్రాలతో పాటు పట్టణంలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసినట్లు సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. పట్టణంలో వైఎస్సార్ సర్కిల్, వాల్మీకి సర్కిల్, యోగివేమన సర్కిల్, సిద్దగిరి ఉన్నత పాఠశాలలో స్క్రీన్‌లను ఏర్పాటు చేశామన్నారు.

ముగిసిన మొహర్రం



తుమ్మలకుంటలో పీర్ల చావడి వద్ద అలావ్ తొక్కుతున్న యువకులు

చిలమత్తూరు: మండలంలో మొహర్రం వేడుకలు ముగిశాయి. బుధవారం తుమ్మలకుంట, కోడూరు గ్రామాల్లో పీర్ల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్ల చావడి వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేశారు. అనంతరం పీర్ల స్వాములు అగ్నిగుండ ప్రవేశం చేశారు. యువకులు, పెద్దలు అగ్నిగుండం చుట్టూ అలావ్ తొక్కుతూ సందడి చేశారు. సాయంత్రం పీర్లస్వాములను జలధికి తరలించారు.

అధికార పార్టీ నాయకుల వేధింపులు ఆపాలి

సోమందేపల్లి: జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలపై అధికార టీడీపీ నాయకులు వేధింపులు ఆపాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాజగోపాల్ డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలపై దౌర్జన్యం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఓడీ చెరువు మండల కేంద్రంలో నాగమణి అనే అంగన్వాడీ కార్యకర్తపై టీడీపీ నాయకుడు రామాంజినేయులు వేధింపులకు గురిచేయడంతో ఆమె ఆత్మహత్యకు యత్నించిందన్నారు. జిల్లాలోని అంగన్వాడీ ఆయాలు, కార్యకర్తలపై వేధింపులు ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీదేవి, నాగమణి, ప్రమీల, అరుణ, పద్మావతి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల మీద అధికార పార్టీ నాయకుల వేధింపులు ఆపాలని మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ నాయకులు డిమాండ్



సోమందేపల్లి: తహసీల్దార్ శంకర్‌కు వినతిపత్రమిస్తున్న దృశ్యం

చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ గిరియప్పకు వినతిపత్రాన్ని అందజేశారు. ఓడీసీ ప్రాజెక్టు వీరప్పగారిపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త నాగమణిని వేధింపులకు గురిచేసిన అంజనేయులును వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ లీడర్ అని చెప్పుకుంటూ వేధింపులు చేస్తున్నాడని, దీంతో నాగమణి ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అమరాపురం: ఆర్ఐ గిరియప్పకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

లేపాక్షి: రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను వేధించే వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రమీళమ్మకు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రంను అందజేసారు. కార్యక్రమంలో నాయకులు నరసింహప్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, భాగ్యమ్మ, శశికళ, మాధవి పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలపై రాజకీయ నాయకుల వేధింపులకు నిరసనగా సీఐటీయూ పిలుపుమేరకు బుధవారం పట్టణంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం, ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వీరప్పగారిపల్లిలో మినీ అంగన్‌వాడీ కార్యకర్తను వేధించిన ఆంజనేయులును వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ పంపాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్, సీడీపీఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాము, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యదర్శి లావణ్య, అధ్యక్షురాలు శోభమ్మ, సెక్టర్ లీడర్స్ శిరీష, వరలక్ష్మీ, వాణి, శ్రీదేవి, ఉమా తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం: తహసీల్దార్ కార్యాలయం వద్ద డీటీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం